మర్యాదపూర్వక కలయిక



వడ్డేపల్లి రాజేశ్వరరావును సన్మానిస్తున్న సాయిబాబానగర్ అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ సాయిబాబానగర్ కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికలో ఈటల రాజేందర్ విజయం సాధించిన నేపథ్యంలో ఆయనను కలిసి శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శంకర్, కాశిరెడ్డి, ప్రదీప్, రమణారెడ్డి, చంద్రశేఖర్, ప్రవీణ్, హరి, ఫణి, జనార్దన్, చంద్రప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 47, వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 60, బజ్జిమిర్చి 55, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 21, బీన్స్ 115, క్యారెట్ 40, గోబిపువ్వు 23, దొండకాయ 18, చిక్కుడుకాయ 65, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలుగడ్డ 33, కీరా 28, దోసకాయ 28, సొరకాయ11, పొట్లకాయ 18, కంద 45, ఉల్లిపొరక 105, ఉల్లిగడ్డ 29, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 33, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు 60 నుంచి 70, మునగకాయలు 4 నుంచి 5, బొప్పాయి 33, పుట్టగొడుగులు 35, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

సమష్టి కృషితోనే ప్లాస్టిక్ నియంత్రణ

కాచిగూడ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తరిమికొట్టేందుకు చేతులు కలపాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన 'మేము సైతం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసే వస్తువు సింగిల్ యూజ్ బ్యాగులను పూర్తిగా నిషేధించాలన్నారు. అనేక మంది మిగిలిన ఆహారపదార్థాలను ఈ ప్లాస్టిక్ సంచుల్లో ఉంచి పడవేయడం వల్ల మూగ జీవాలు తిని ప్రాణాలు కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా ప్లాస్టిక్ సంచుల్లో ఉండిపోయిన వ్యర్థాల కారణంగా పరిసరాలు దుర్గంధ మయంగా మారతాయని, నీటి వనరులు మనుగడ కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనివల్ల ప్రకృతిలో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ పై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాల్లో పోస్టర్లను అంటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా ప్లాస్టిక్ నియంత్రణకు చట్టాన్ని పటిష్టం చేయాలన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు




పూజలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టి గౌడ్, రాజేందర్, పదయ్య, కె. నరసింహులు, సిద్దయ్య, రాజ్యలక్ష్మి, రేణుక, రాజేశ్వరి, నాగరాణి, అశ్విని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కులగణన ప్రక్రియను ప్రారంభించాలి

కాచిగూడ: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వెంటనే కులగణన ప్రక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. గురువారం ఆయన కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పక్షాన నిలిచి రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాలలో అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు కృషి చేశారన్నారు. బీసీ కులాల వారీగా జనాభా లెక్కలు తీసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

ధారణా శిబిరంతో జ్ఞాపకశక్తి పెంపు



చిన్నారులకు లస్సీ పంపిణీ చేస్తున్న కట్టెల సుభాష్, తదితరులు

నల్లకుంట: చిన్నారుల్లో జ్ఞాపక శక్తి, మేధా శక్తిని పెంపొందించేందుకు నల్లకుంట శంకరమఠంలో నిర్వహిస్తున్న 'ఉచిత ధారణా(జ్ఞాపక శక్తి) శిక్షణ శిబిరం' దోహదపడుతుందని టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట శంకరమఠంలో సువర్ణ భారతి మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ధారణా శిబిరంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు లస్సీ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చిన్నారుల మేధోశక్తిని పెంపొందించే శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో చిన్నారులకు కథలు, భజనలు, రామాయణం, విష్ణు సహస్రనామ స్తోత్రధారణతో పాటు మేధా శక్తిని పెంచే ఆటల్లో శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హరినాథ్ రెడ్డి, శరత్, ఎస్.గిరి, బి. కాంతారావు, కాలేరు శ్రీనివాస్ రావు, ఎడ్ల నరేందర్ రెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి, సీహెచ్. మురళీ కృష్ణ, విశ్వేశ్వర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, ధారణా శిబిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్లకు మెరుగైన సేవలు

రాంగోపాల్‌పేట్: రైల్వే పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ శశికుమార్ తెలిపారు. రెజిమెంటల్‌బజార్‌లోని ఎస్‌బీఐ హిమ్మత్‌నగర్ శాఖలో రైల్వే పెన్షనర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి శాలువ, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. పెన్షనర్ అసోసియేషన్ ప్రతినిధులు బీకేసింగ్, విద్యాసాగర్, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు తదితరులున్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

● కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గురాచారి ● పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రకళ సమక్షంలో సమావేశం



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి జెడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం గురాచారి తదితరులు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. అందులో భాగంగా కూకట్‌పల్లిలో గురువారం జెడ్పీహెచ్ ఎస్ హెచ్‌ఎం గురాచారి అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రకళ సమక్షంలో పాఠశాల స్థాయి సమావేశం నిర్వహించారు.

◆ ఈ సమావేశంలో గురాచారి మాట్లాడుతూ... ప్రభుత్వం సంకల్పించినట్లు ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. చిన్నారుల తల్లిదండ్రులకు పాఠశాలలోని వసతులు, ఉపాధ్యాయుల అత్యున్నత విద్యార్హతలను వివరించారు. తరగతి గదుల్లోని అధునాతన సాంకేతికతతో ఉన్న ఐఎఫ్‌పీ బోర్డులతో విద్యార్థులకు డిజిటల్ సదుపాయం బోధించే పద్ధతులను స్వయంగా వివరించారు.

◆ తల్లిదండ్రులు చదువును కొనకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ పిల్లలకు విద్యావకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆదేశించినట్లు బడిబాట కార్యక్రమంలో రోజువారి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులచే బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను చేర్పించటమే బడిబాట లక్ష్యం: నీలవేణి

మోతీనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించటమే బడిబాట లక్ష్యమని బబ్బుగూడ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు పి.నీలవేణి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వం చేపట్టిన ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 19వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవగాహన కల్పించి బడుల్లో చేర్పించడమే బడిబాట ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు బి. సావిత్రి, పుష్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని మూసాపేటలో ర్యాలీ

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మూసాపేటలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం టి. కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం భోజన పథకం, యూనిఫారమ్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హేమలత, ప్రైమరీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం

మోతీనగర్: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలనే లక్ష్యంతోనే ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వి.రామారావునగర్ పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణ అన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్‌లోని ఈ పాఠశాలలో బడిబాటు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, రాధా, నాయకులు సత్యం గంగపుత్ర, కె.సత్యనారాయణ, శ్రీనాథ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



బబ్బుగూడలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు



ర్యాలీ నిర్వహిస్తున్న మూసాపేట ప్రభుత్వ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు



వి.రామారావునగర్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో హెచ్‌ఎం అన్నపూర్ణ

కేపీహెచ్‌బీ డివిజన్ సమస్యలను పరిష్కరించండి



కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ నాయకుల కొప్పిశెట్టి దినేష్‌కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు గురువారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి బండిరమేష్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా కేపీహెచ్‌బీ కాలనీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన రమ్య గ్రౌండ్ ప్రహరీ శిథిలావస్థలో ఉందన్నారు. తక్షణమే దానికి మరమ్మతులు చేయాలని కోరారు. అదే విధంగా రమ్యాగ్రౌండ్‌లోని బాత్‌రూమ్‌లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

◆ కేపీహెచ్‌బీ కాలనీలోని తొమ్మిదో ఫేజు మెయిన్ రోడ్డుమీద ఉన్న మున్సిపల్ పార్కు గత దశాబ్ద కాలంగా ఆదరణకు నోచుకోకుండా చెత్తతో నిండిపోయిందని వెంటనే మున్సిపల్ అధికారులు పార్కును తిరిగి ఉపయోగించే రీతిలో తయారు చేయాలని కోరారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజు, సర్దార్ పటేల్‌నగర్‌లోని మోడల్ రైతు బజార్లను పూర్తిగా నిర్వీర్యం చేసి కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని తెలిపారు. తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకొని న్యాయం కోసం కృషి చేయాలని బండి రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామారావు, సురేష్, రాజేష్, సుబ్బు, వనజ, వీణ, సుజాత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



ఛత్రపతి శివాజీనగర్‌లో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఛత్రపతి శివాజీనగర్‌లోని రోడ్ నం.1 - 4లో సీసీరోడ్డు పనులను రూ.15లక్షలతో చేపట్టారు. మరో రెండు వీధుల్లో సీసీరోడ్లను నిర్మించాల్సి ఉంది. గురువారం ఈ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తిచేయాలన్నారు. సీసీరోడ్డు నిర్మించినందుకు కాలనీవాసులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, అంజయ్యయాదవ్, బాలరాజు, కె.రమేష్, పోశెట్టిగౌడ్, రాజేందర్, పదయ్య, పోచయ్య, ఎల్.రాజు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న మక్కాల సత్యానారాయణ

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజల్లో మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు మక్కాల నర్సింగ్‌రావు, దండుగుల రమేష్, నిమ్మకాయల నర్సింగ్, నాయకులు మట్టి శ్రీను, నాగేష్, బల్‌రాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం జరగకుండా చూస్తాం

మూసాపేట: మియాపూర్‌లోని సెక్యూరిటీ ఆఫీస్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ప్రతాప్ అనివార్య కారణాలతో ఉద్యోగం మానేశాడు. దీంతో ఆయనకు రావాల్సిన మార్చి, ఏప్రిల్ నెల జీతాన్ని ఇవ్వాలని యాజమాన్యాన్ని సంప్రదించారు. యజమాని దుర్భాషలాడి జీతం చెల్లించలేదు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్మిక నేత రవిసింగ్ యజమానితో మాట్లాడారు. ప్రతాప్‌కు రావాల్సిన రెండు నెలల జీతం ఇచ్చేలా ఒప్పించారు. గురువారం మూసాపేటలోని తన కార్యాలయంలో ప్రతాప్‌కు జీతం డబ్బులను అందజేశారు. కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా తాను ముందుండి న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



ఓ కంపెనీ నుంచి రావాల్సిన జీతాన్ని ప్రతాప్‌కు అందజేస్తున్న రవిసింగ్

లిఫ్టు గుంతలో పడి కార్మికుడి మృతి

హఫీజ్‌పేట్: నిర్మాణంలో ఉన్న భవనం లిఫ్టు గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్‌సింగ్ (40) గత 20 రోజుల క్రితం గంగారం అపర్ణ హిల్ రిజ్ పక్కనే ఉన్న రంజన్ వైభవ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం భవనంలోని 11వ ఫ్లోర్‌లో పని చేస్తుండగా జారి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. తీవ్రగాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఈ విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్ట్ మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పేదల పొట్టను కొట్టడం సరికాదు

◆ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ◆ షెడ్ల కూల్చివేతపై ఆగ్రహం



ఇందిరానగర్‌లో షెడ్లు కూల్చివేతను ఖండిస్తున్న బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన బస్తీవాసులు కొన్నేళ్ల క్రితంగా రోడ్డు పక్కన షెడ్లు వేసుకొని చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. హఠాత్తుగా రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు షెడ్లను నేలమట్టం చేశారు. చిరువ్యాపారులు ఎంత ప్రాధేయపడినా పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. అధికారుల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్‌ఎస్ హయాంలో చిరువ్యాపారులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల పొట్టను కొడుతోందని ఇది సరికాదన్నారు. పేదల మీద ఇలా విరుచుకుపడితే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మీద కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అధికారులు అదే లేన్‌లో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడం దారుణమన్నారు.

నల్లగండ్లలో నటి శ్రియారెడ్డి సందడి



హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ నియో మాల్‌లో గురువారం సలార్ ఫేమ్ నటి శ్రియా రెడ్డి సందడి చేశారు. మాల్‌లోని కమల్ వాచెస్‌లో ప్రత్యేక ఎడిషన్ టైమెక్స్, గెస్ వాచెస్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. టైమెక్స్ ఇండియా ఎండీ దీపక్ ఛాబ్రా, ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం కేంద్రప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్స్‌ను అందజేస్తామన్నారు. వివరాలకు సెల్: 7893141797 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓయూ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూలో పని చేస్తున్న 382 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లభించింది. గురువారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఓయూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్ ఈఎస్‌ఐ, పీఎఫ్ పత్రాలను అందజేశారు. ఈ సౌకర్యంతో ఉద్యోగులు వైద్యం, ఇతర సదుపాయాలతో పాటు అనేక రకాలుగా లబ్ధి పొందుతారని వివరించారు. ఓయూలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వర్కర్ల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాడి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించిన్నట్లు పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి వేతనాలు పెంచడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సీతారం, నాయకులు లక్ష్మీనర్సమ్మ, వెంకటమ్మ, రాణి పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సన్మానం



కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రవికుమార్ యాదవ్, సీతారామరాజు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో గురువారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సీతారామరాజు హైదర్‌నగర్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్ నుంచి భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, జయశ్రీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న మామిడి నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గత పదేళ్ల కాలంలో దళితులకు అందజేసిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల సంక్షేమం, పథకాల వాటాలు, వాస్తవాలు అంశంపై రీసర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మామిడి నారాయణ మాట్లాడుతూ పదేళ్లల్లో ఎస్సీ మాల, మాదిగ, ఇతర ఉప కులాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, దళిత బంధు, మూడు ఎకరాల భూమి తదితర పథకాల వివరాలపై కులాల వారీగా శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా దళితుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మంచాల లింగస్వామి, ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, బత్తుల రాంప్రసాద్, డాక్టర్ నిమ్మబాబురావు, దుబ్బాక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ డే ఉత్సవాలకు డా.సింగం శ్రీనివాస్‌రావుకు ఆహ్వానం



డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావును ఆహ్వానిస్తున్న డాక్టర్ ఆదినారాయణ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మ్యాగ్నస్ డయాగ్నస్టిక్ సెంటర్ ఎండీ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం శ్రీనివాసరావుకు వెయ్యి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన సందర్భంగా ఢిల్లీలోని ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 1న ఆంధ్ర, తెలంగాణ భవన్‌లో జరిగే అంతర్జాతీయ డాక్టర్స్ డే ఉత్సవాలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆదినారాయణ హైదరాబాద్‌లోని మ్యాగ్నస్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను సందర్శించి డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావును సత్కరించడంతో పాటు డాక్టర్స్ డే వేడులకు ఆహ్వానించారు.